# తెలిసిన విలువలు

"అబ్బబ్బా! కాలికి కాస్త దెబ్బతగులుతే - యిహ కాలమే తీరి పోయింది అన్నట్లుగా ఎవరైనా ప్రవర్తిస్తారా మంజూ! ఏమిటా పిచ్చి తనం! ఇంకో వారం రోజుల్లో ఎప్పటిలా తిరుగుతావని డాక్టర్ చెప్ప లేదూ!" దెబ్బతగిలిన కాలుకి కట్టిన కట్టుని పదేపదే చూసుకుంటూ-ఇహ కుంటిదాన్నయి పోతానేమోనని బెంగపడుతున్న భార్యవంక చూస్తూ అన్నాడు శేఖర్. కిటికీ దగ్గరగా మంచంమీద గోడకి చేరగిలవేసిన గుండ్రని దిండుని ఆనుకుని కూర్చున్న మంజు మొహంలో మహా రాజ్యాన్ని కోల్పోయిన మహారాణి తాలూకు దీనత్వం కన్పిస్తోంది.

"ఏం ఫర్వాలేదు. కత్తిపీట కాబట్టి కాస్త సెప్టిక్ అయింది. దాని కింత భయం దేనికి?" మంజు కూర్చున్న మంచానికి ప్రక్కగా వున్న డ్రెస్సింగ్ టేబిల్ముందు నిలబడి అద్దంలో చూసుకుంటూ టై కట్టు కుంటూ అన్నాడు.

"మీరలాగే అంటారు. మీకేం తెలుస్తుంది-నా బాధ? ఈ పదిరోజుల నుంచి కాలు క్రింద పెట్టకుండా ఈ మంచంమీద కూర్చుని నేను చూస్తున్న నరకం మీకే కొంచెం అర్థం అయినా మీరలా అనరు. అయినా నేనేమైపోతే మీకేం? మీ క్లబ్లకి, మీటింగ్స్కి ఏం లోపం రావటం లేదుగా?" ఎర్రబడ్డ ముఖంతో, ముడుచుకున్న పెదవులతో భర్తవైపు చూడకుండానే అంది మంజు.

"అదుగో, నువ్వు వెళ్ళమంటేనేగా తయారవుతూంది నేను. సర్లే! పోనీ, నీకంతకష్టంగా వుంటే అసలు వెళ్ళనే వెళ్ళను. ఏదో క్లబ్ వార్షికోత్సవం దగ్గరకు వస్తోంది. కాబట్టి దాని కమిటీ సభ్యుల్లో ముఖ్యుడ్ని కాబట్టి-లేకపోతే వెడతానా? పోనీలే...."కట్టుకుంటున్న టై మధ్యలో ఆపి విప్పేసి శేఖర్‌వచ్చి మంజు ప్రక్కన కూర్చున్నాడు.

"ఏమక్కర్లేదు వెళ్ళండి. అయినా ఒక రోజూ రెండురోజులా? మీరు వెళ్ళండి. మరీ యెందుకో దిగులనిపిస్తుంది. మీరు కాస్త కనుమరుగయితే ఈ గాయం యింతతై ఓ పెద్ద రాక్షసిలా నన్ను భయపెడుతోంది. నువ్వు కుంటిదానివి సుమా! ఇంక జన్మలో నువ్వు మామూలుగా నడువలేవని వెక్కిరిస్తుంది అదే మీరు ప్రక్కనుంటే భయం వెయ్యదు. కొంచెం ధైర్యంగా వుంటుంది. నేనెలాటి పరిస్థితుల్లో ఉన్నా అందంగా ఉన్నా లేకపోయినా ఆరోగ్యం పాడయినా, అంగవైకల్యంవున్నా నన్ను ప్రేమించి ఆదరించగల వ్యక్తి ఒకరు నాకున్నారు అనిపిస్తుంది. అంతే! అందుకే యెప్పుడూ మిమ్మల్ని ఎక్కడికీ వెళ్ళనివ్వకుండా చెయ్యాలనిపించేది. అంతేకాని-లేకపోతే, ఇదివరకెప్పుడయినా నేను యిలా చేశానా? ఏ రోజునన్నా మొహం ముడుచుకున్నానా? అది మీకు తెలియదా? మీరు గ్రహించలేరా అసలు విషయం?" సిగ్గుతో బాధతో యెర్రబడిన మొహాన్ని అరచేతుల్లో దాచుకొంటూ అంది మంజు.

క్షణంసేపు పరిశీలనగా భార్యవంక చూసిన శేఖరం మరికొంచెం దగ్గరగా జరిగి మంజు తలమీదచేయివేసి జుట్టు నిమురుతూ "నాకుతెలుసు మంజూ! ప్రతి చిన్నవిషయాన్ని విపరీతంగా తీసుకొని అనుభూతి పొందే నీ మనసు యెలా గిలగిలలాడ్తుందో నేను ఊహించుకోగలను. నన్ను వెళ్ళవద్దనటంలో నీ ఉద్దేశం నాకర్థమవుతోంది. కాని యేం చెయ్యాలి చెప్పు? ఒక్క అరగంటకంటే ఎక్కువ వుండను. అన్నీ చెప్పేసి వచ్చేస్తాను. ఈరోజు వెళ్ళాలి. ఏదీ తలెత్తిచూడు. ఊ! ఇదిగో గడియారం దగ్గర పెట్టుకో. ఇందులో ముల్లు 7 చూపేసరికి నేను నీ ప్రక్కన ఉండకపోతే

నీయిష్టం వచ్చిన శిక్ష విధించు. యేం? తలెత్తుమరి." తన చేతికున్న గడియారం తీసి మంజు చేతికి పెడుతూ అన్నాడు శేఖరం.

"వద్దు ఫర్వాలేదు మీరు వెళ్ళండి." గడియారం చేతికి పెట్టనివ్వకుండా చేతులు వెనక్కు పెట్టుకుంటూ అంది మంజు.

శేఖరం బలవంతాన మంజు చేతికి గడియారం పెట్టి మళ్ళీ అద్దం ముందుకు వచ్చి టై కట్టుకోసాగాడు "మందు తాగు ఈరోజు జ్వరం రాకపోతే యిహరాదని చెప్పాడు డాక్టరు. నేను వస్తూ ఆ టాబ్‌లెట్స్ తెస్తాను. మందు తాగటం మర్చిపోకు, సాధ్యమైతే యింకా ముందుగానే వస్తాను. ఏం?" మాటలు చెపుతూనే వెళ్ళిపోయాడు అతడు.

క్రమంగా అతని కారు వెళ్ళిపోతున్న శబ్దం దూరమైపోవటంతో మంజు లేచి సరీగా కూర్చుంది. "గడియారం చూస్తుండు, ముల్లు 7 చూపించే సరికి నేను రాకపోతే చూడు." భర్త తన చేతికి పెట్టివెళ్ళిన గడియారాన్ని తడిమిచూసుకుంది గడియారంచైన్‌లో శేఖర్ చేతిస్పర్శఇంకా ఉన్నట్లుగానే వుంది మంజుకి.

ఏదయినా కాలికి తగిలిన ఈ దెబ్బ యిదివరకు తెలియని ఓకొత్త అనుభవాన్ని నేర్పింది. మంజుకి ఓ విధంగా ఆనందంగానే వుంది.

పదిరోజుల క్రితం శేఖర్ ఆఫీసు పనిమీద క్యాంప్ వెళ్ళాడు. ఎనిమిది రోజులు-ఏదో ఇన్‌స్పెషన్ గొడవ వుండటంవల్ల - బెంగాల్ నుంచి వొక ఆఫీసర్ రావటంవల్ల మంజుని తప్పనిసరిగా యింటిదగ్గర వదిలేసి వెళ్ళాల్సి వచ్చింది. ఎనిమిది రోజులూ యెనిమిది యుగాల్లా గడిచినాయి. ఎంతో కష్టంమీద శేఖరం తిరిగివచ్చే రోజు వచ్చింది. ఆ రోజు సాయంత్రం గూడా చాలా ఆలస్యంగానే అయింది.

అప్పటికి స్నానం అదీ చేసేసి శేఖర్‌కి ఎంతో యిష్టమైన జరీ అంచు తెల్లచీర, జాకెట్ వేసుకుని ఇప్పుడో కాసేపట్లోనో వినిపించబోయే "మంజూ!" అనే పిలుపుకోసం ఒళ్ళంతా చెవులు చేసుకుని యిల్లంతా కలియతిరుగుతోంది. వంట ఇంట్లో వంటమనిషి - సాయంత్రానికి కావ

ల్సిన ఏర్పాట్లు చూస్తోంది. శేఖర్ రాగానే స్వయంగా తనచేతుల్లో కలిపిన కాఫీ యివ్వాలనే తొందరలోవున్న మంజు వంటింట్లో కాఫీ కలిపే ప్రయత్నంలో వుంది. కాఫీ కలపటం పూర్తయింది. అది ఫ్లాస్కులో పోయబోతుండగా హాల్లోంచి "మంజూ!" అన్న పిలుపు వచ్చింది. అరె! కారు హారన్ గూడ విన్పించలేదే - అనుకున్న సమయానికి అరగంట ముందుగానే - ఆ పిలుపు విన్పించటం మంజు తన చెవుల్ని తనే నమ్మలేక హాల్లోకి పరుగెత్తింది ఆ పరుగెత్తటంలో చాపి అంగ వెయ్యటంలో అది కత్తిపీట మీద పడింది. పదునుగల కత్తిపీట దొరికిన అవకాశాన్ని దుర్వినియోగ పరుచుకునే మూర్ఖురాల్ని కాదు - అన్నట్లు మంజు పాదాన్ని కసిక్కున కొరికింది. "అబ్బా!" అంటూ ఒకసారి వంగి పాదాన్ని వదిలించుకుని ఆ కాలితోనే కత్తిపీటని ప్రక్కకునెట్టి మంజు సుడిగాలిలా హాల్లోకి వచ్చింది. అప్పటికే శేఖర్ బూటులేస్ విప్పి కాళ్ళతో గోడవారగా తోస్తున్నాడు.

"ఇంత తొందరగా వచ్చేశారేం. అబ్బ! ఈ రోజు అసలు సాయంత్రమే కాలేదు. మీ రొచ్చేశారు. ఎంతబాగుంది! ఈ వారం రోజులు ఒక్క నిమిషంగూడా తోచలేదు." శేఖర్ చేతుల్లో వాలిపోయిన మంజుకి తన కాలు తెగటం కాని, అది రక్తం గుమ్మరిస్తున్నట్లు గాని తెలియదు.

"అగు. వుండు మరి - నన్ను మేజోళ్ళు విప్పనీ!" తన మెడచుట్టూ చేతులు వేసిన మంజు చేతుల్ని విడదీస్తూ అన్నాడు అతను. అసలు విషయం వంటింట్లోంచి చేత్తో గరిట పట్టుకుని వంటమనిషి కనులు పెద్దవి చేసుకుని తొంగి చూస్తూంది.

"ఏమిటిది? నువ్వు నడుస్తుంటే ఈ ముద్రలేమిటి?" క్షణంసేపు వంటమనిషి చూస్తోందన్న సంకోచంతో నేలమీద వాలిన శేఖరం చూపులు తెల్లబోయినాయి. అప్పుడుగాని మంజుకి గుర్తు రాలేదు. కాలుకి దెబ్బ తగిలిందని.

"అరె—ఏదీ కాలు - ఇంత రక్తం రావటం ఏమిటి?" అతను

చప్పున మోకాళ్ళమీద వంగి కూర్చొని మంజు పాదాల్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

గులాబీరేకుల తాలూకు నాజూకుతనాన్ని నింపుకున్న పాదంలో రెండంగుళాలు లోతుగా గాయం అయింది. ఇంకా రక్తం వస్తూనేవుంది. ఆ రక్తంలో ఎరుపుకి శేఖరం కనులు క్షణంసేపు చెదిరినాయి.

"అవును. వస్తుంటే కత్తిపీట వుంది-దానిమీద కాలు వేశాను. కొంచెం దెబ్బ తగిలింది" మంజుకు అప్పటికిగాని గాయంవల్ల కలిగే బాధ గుర్తుకు రాలేదు.

"నీ మొహం అన్నీ ఖంగారే. అంతా తొందరే-వచ్చేవాడ్ని ఏమైపోతాను. కాస్త నిదానంగా రాకూడదు-అంత వళ్ళు తెలియకుండా ఎలా పరుగెత్తావు? అసలు వంట ఇంట్లో నీకేం పని వచ్చింది. క్రింద కత్తిపీట ఎవరు పెట్టారు?" భార్య నడుంచుట్టూ చెయివేసి గోడవారగా వున్న కుర్చీలో కోర్చోపెట్టాడు. మంజు నడచిన ప్రతి అడుగూ రక్తంతో తడిసి నేలమీద ముద్రపడింది.

"అయ్యయ్యో, ఎంత రక్తమో! "శేఖరం చప్పున వంగి పాంట్ జేబులోంచి జేబురుమాలు తీసి పాదానికి నొక్కిపట్టాడు ఇంటో అడుగు పెడుతూనే కోపంగా కేకలు వేస్తున్న శేఖరం కంఠస్వరం విని నౌకర్లు వంటమనిషి హాల్లోకి పరుగెత్తుకొచ్చారు.

"అబ్బా? నొప్పేస్తుంది" కుర్చీలో వెనక్కువాలి మంజు చేతుల్లో కనులు మూసుకుంది. కాని, బాధతో కాదు. శేఖరం ఆదుర్దా నిండిన స్వరం యిచ్చే అనుభూతితో పాదాన్ని సున్నితంగా రెండు చేతులతో పట్టుకున్నప్పటి స్పర్శానందంతో.

బట్టలు మార్చుకోకుండా- మంజుని అలాగే కారులో కూర్చోపెట్టుకుని డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళాడు అతను. గాయం కొంచెం లోతుగా తెగినా ఫర్వాలేదనీ నయమైపోతుందనీ చెప్పి డాక్టర్ కట్టు కట్టాడు. మంజుకి ఏమీ బాధ అనిపించలేదు కట్టు కట్టిన కాలుతో హుషారుగానే నడచి వచ్చి కారులో కూర్చుంది.

"మరీ అంత వళ్ళుతెలియకుండా ఉండటం మంచిది కాదు మంజూ! చూడు ఎంత గాయం అయిందో-చాల రక్తంపోయింది" ఆ రాత్రిపడుకో

బోయేముందు మంజు కాలి కట్టుని చేతితో తాకి చూస్తూ అన్నాడు శేఖరం.

"తగి లే తగిలింది. నాకు బావుంది. నాకోసం మీరెప్పుడూ యిలా ఆదుర్దా పడలేదు. ఇందాక రక్తం కారుతుంటే మీరు వంగి నా పాదాల్ని పరిశీలిస్తూంటే అప్పుడు మీ కళ్ళలో భావం చూస్తూంటే నాకెంతో హాయిగా ఉంది. నాకు ప్రతిరోజూ ప్రతినిమిషం అలాంటి అనుభూతి మీ కళ్ళలోంచి అందితే ఎంత బాగుంటుంది!" కొద్దిగా అలసి ఉత్సాహంగా కళ్ళల్లో మెరుపులు కురిపిస్తూ అంది మంజు. శేఖర్‌కి అర్థం కాలేదు. కాని తనకోసం పరుగెత్తుకు రావటంలో, మంజుకి ఇంత పెద్ద దెబ్బతగిలిందే అని మనసు మంజుపట్ల జాలితో-అదేదో సున్నితమైన భావం నిండిపోతోంది.

అ మర్నాడు గూడ యేమంత బాధనిపించలేదు. శేఖరం వద్దని కేకలు వేస్తున్నా విన్పించుకోకుండా మంజు ఇంట్లో మామూలుగానే తిరిగింది కానీ మూడో రోజు పాదం బాగా వాచిపోయి మంజుని మంచం మీదనుంచి కాలు క్రిందికి పెట్టనివ్వలేదు. చాలా బాధగాకూడా అన్పించింది. అ రోజు డాక్టర్ తనే ఇంటికి వచ్చాడు. ఆ సాయంత్రం జ్వరం కూడా వచ్చింది. దానికితోడు సెప్టిక్ ఐంది. ఆపరేషన్ చెయ్యాలన్నారు డాక్టర్.

"వద్దు, వద్దు పాదంలో సగం తీసేస్తాడేమో-లేకపోతే ఒకటి రెండు వేళ్ళు కత్తిరించేస్తాడేమో- వద్దు నాకు ఆపరేషన్ వద్దు. అదే తగ్గిపోతుంది. నన్ను మీరంతా కలిసి కుంటిదాన్ని చెయ్యొద్దు." గోలపెట్టేసింది మంజు.

"ఏమిటది-మరీ చిన్నపిల్లలా! వేళ్ళెందుకు కత్తిరిస్తాడు. నీమొహం కాస్తంతని కొండంత చెయ్యకు అనవసరంగా" విసుక్కున్నాడు శేఖరం.

"ఇప్పుడయితే కాస్త అపరేషన్‌తో సరిపోతుంది. ఇది వద్దని మానేస్తే. సరే మీ యిష్టం. కొన్నాళ్ళు పోయింతర్వాత పూర్తి కాలంతా తీసెయ్యాలి. ఇది మీకు ఇష్టమేనంటే నాకేం అభ్యంతరంలేదు" మెడిసిన్ బాగ్ చంకన పెట్టుకుని డాక్టర్ వెళ్ళిపోవటానికి లేచాడు.

"పూర్తి కాలంతా తీసెయ్యటమా?- ఓ మూల కాస్త వంకర భరించలేని తను ఓ కాలు పూర్తిగా లేకుండా ఉండటమా?" భయంతో మంజుల ప్రతి నరం వణికింది. చివరికి చాలా సేపయింతర్వాత శేఖర్ వళ్ళో తలదాచుకుని నెమ్మదిగా "ఆపరేషన్ చెయ్యమనండి కాని వేళ్ళు కత్తిరించవద్దనండి. ఒకసారి మా పిన్నికి ఇలాగే సెప్టిక్ అయితే కుడి పాదం మూడువేళ్ళు కత్తిరించేసారు నేనావికృతాన్ని భరించలేను"అంది.

"భయంలేదని చెపుంటే వినవేం మంజూ! వేళ్ళెందుకు తీసేస్తారు? పోనీ ఒకవేళ తీసేయ్యాల్సివస్తే-నావి తీయించి వాటి స్థానంలో పెట్టిస్తాను. సరేనా? కొంచెం మోటుగా వుంటాయేమో! మరి అదైనా భరించగలవా?" నవ్వుతూ అన్నాడు శేఖరం బుజ్జగిస్తున్నట్లు.

అసలు మంజు స్వభావమే అంత. పొరపాటుగా ఎక్కడైనా రోడ్డు మీద యే కుంటివాళ్ళన్నా, గుడ్డివాళ్ళన్నా కన్పిస్తే భయంతో చప్పున మొహం తిప్పుకుంటుంది. ఓ రోజు శేఖరానికి బాగా గుర్తుంది. ఆరోజు ఓ ఫ్రెండ్ యింటికి భోజనానికి వెళ్ళి తిరిగివస్తూ పెట్రోల్ కోసం ఓ బంకు దగ్గర కారు ఆపితే అక్కడ కన్పించిన ఓ ముష్టిదాన్ని చూసి మంజు రెండు రోజులు ఒకటే బాధ పడింది.

ఆ ముష్టిది చేతిలో నెత్తురు గడ్డలావున్న ఓ పసికందు పిల్లాడ్ని చూపించి, "అయ్యా...దానం. .బాబూ పిల్లాడు" అంటోంది. అసహ్యంతో, భయంతో మొహం తిప్పేసుకుంది మంజు. ఇవేం గమనించని శేఖరం జేబులోంచి పర్సుతీసి చేతికి వచ్చిన నాణేన్ని తీసి ముష్టిదానివేపు విసిరేశాడు. పెట్రోలు నింపుకున్న కారు ముందుకు కదిలింది. అంతవరకు నవ్వుతూ, తుళ్ళుతూ కబుర్లు చెపుతున్నా మంజు హఠాత్తుగా మూగవోయినట్లు కూర్చోవటం చూసి శేఖరం కారణం అడిగాడు. మంజు అడిగింది; "మరి సృష్టికంతటికీ కారణం భగవంతుడు అంటారే-దేవుడే ఈ సృష్టికి కారణం అయితే ప్రపంచంలో అసలింత వికృతం ఉంటుందా? మనం యిలా ఆరోగ్యంగా హాయిగా వుంటాం వాళ్ళెందుకు అలా ఉంటారు? మరి. కానీ-కానీ—భగవాన్ నువ్విది సృష్టించినా సృష్టించకపోయినా అసలు నువ్వనేవాడివి ఉంటే నీకేమాత్రం

కరుణ, జాలి అనేవి వుంటే అవి వాళ్ళకి పూర్తిగా యిచ్చేసి వాళ్ళకు నువ్వు చేసిన అన్యాయంలో సగం అయినా తీర్చు."

దానిమీద శేఖరం వ్యాఖ్యానం చెయ్యలేదు, వాదించలేదు. విని ఊరుకున్నాడు. కాని తనకంతగా కదిలించని కొన్ని విషయాలు మంజుని అలా కుదిపి కుదిపి మనశ్శాంతిని తినెయ్యటం-వాటికోసం మంజు బాధపడటం అతనికి చిత్రంగానే వుండేది.

అదంతా గుర్తొచ్చిన శేఖరం అపరేషన్ అయింతర్వాత మంజు తల నిమురుతూ "ఫర్వాలేదు. ఒక వారం రోజులు పూర్తి విశ్రాంతి తీసుకుంటే మామూలుగా అయిపోతావు" అని ధైర్యం చెప్పాడు.

మంజు అసలు మంచం మీదనుంచి కిందికి కాలు దింపనేదింప కూడదు అన్నాడు డాక్టర్. అంతకంటే వేరే నరకం లేదు. అయినా భరించక తప్పలేదు. శేఖరం క్యాలెండరు తెచ్చి మంజు కెదురుగా పెట్టాడు.

ఎలాగైతేనేం-శేఖరం సపర్యలతో, వంటమనిషి మాటలతో ఆరు రోజులు యిట్టే గడిచిపోయినాయి. మంజుకోసం శేఖరం అన్ని పనులూ మానుకున్నాడు. కారు గేరేజ్ నుంచి తీసి ఆరు రోజులైంది. మంజు పెళ్ళయింతర్వాత శేఖరం ఇంత స్థిమితంగా తన ప్రక్కన కూర్చోవటం యిదే మొదటిసారి. క్రమేపీ సాయంత్రంపూట జ్వరం రావటంగూడ తగ్గిపోయింది. గాయంకూడా మూడొంతులు తగ్గిపోయింది. ఒక వంతు పచ్చి ఉండగానే లేచి కొంచెంగా ఎక్కువ శ్రమలేకుండా అటూ ఇటూ అడుగులు వెయ్యమన్నాడు డాక్టర్. శేఖర్ తనే స్వయంగా మంజు చేతిని తన మెడచుట్టూ వేయించుకుని యెడం చెయ్యి భార్య నడుం చుట్టూ వేసి గదిలో గుమ్మం దగ్గరనుంచి గోడ చివరకు, గోడ నుంచి కిటికీ దగ్గరకూ నడిపిస్తున్నాడు. అతని నిదానానికి, ఓపికకి, శ్రద్ధకి మంజు ముగ్ధురాలై చూడసాగింది. వేళపట్టున గుర్తుపెట్టుకొని మందు కలిపి యివ్వటం, సాయంత్రం పూట జ్వరం వచ్చిందో, లేదో అని ధర్మామీటరుతో చూడటం, మధ్యాహ్నంపూట యేమీ తోచటం లేదంటే ఏదయినా పుస్తకం చదివి విన్పించటంతో మంజుకి జీవితాంతం యేదయినా జబ్బు చేసి అలా యెప్పుడూ అతను దగ్గరగా వుంటే బాగుండు ననిపిస్తోంది.

తన కాలు బాధ తగ్గిపోతే-మళ్ళీ మామూలు జీవితం, అతని స్నేహితులు, సభలు, సమావేశాలు, విందులు, వినోదాలు-అప్పుడు గూడా తను ప్రక్కనే వుంటుంది. కాలుకి దెబ్బ తగలనంతవరకూ మంజుకి అదీ అందంగానే కన్పించింది. కానీ కాలికి తగిలిన యీ గాయం మంజుకి తెలియని ఓ విలువైన సుఖాన్ని—శేఖరంలో తనంతకుముందు చూడని లోతుల్ని చూపించింది. ఇప్పుడైతే తామిద్దరే- పేకాటకి, క్రికెట్‌కి లాక్కుపోయే రాక్షసులు లేరు.

ఓ రోజు సాయంత్రం తనకి మందు కలిపి యిస్తున్న భర్తని తదేకంగా చూస్తున్న మంజు "మీరు డాక్టరై-నేను పేషెంటునై యెక్కడో ఓ మారుమూల-చాలా అందంగావున్న పరిసరాలమధ్య— యెతుగా ఓ కొండమీద చిన్న డాబాలో ప్రతిరోజు సాయంత్రం నేనిలా వెనక్కు జారగిలబడి కూర్చుంటే-మీరలా టేబిల్ దగ్గర నిలబడి మందు కలుపుతుంటే యెంతబాగుంటుంది కదూ అంది. మందు కలుపుతున్న శేఖరం ఆగి మెడతిప్పి భుజంమీదుగా భార్యని చూశాడు మంజు నిజంగా ఎక్కడో కొండలమీద డాబాలో కూర్చున్నట్లే ఉంది.

"ఎందుకలా చూస్తారు ఏం. అలా వుంటే బాగుండదా?"

"బాగానే వుంటుంది కాని, పులులూ, సింహాలూ వస్తాయని భయం. ఎందుకైనా మంచిది. రేపట్నుంచి ఓ గన్ తెచ్చుకుని షూటింగు నేర్చుకుంటాను. ఇదిగో మందు తీసుకో! కాని మంజూ, నువ్వు కధారచయిత్రివి ఎందుకు కాలేదో నాకు తల బద్దలు కొట్టుకున్నా అర్థంగాదు. ఇంత ఊహాలోకం ఉన్నవారు తప్పనిసరిగా కథలు రాయాలి. లేకపోతే మాలాటివాళ్ళకు ప్రమాదం."

"అంటే?" అంది మంజు ముందుగ్లాసు తీసుకోకుండా శేఖరం కళ్ళలోకి చూస్తూ.

"కాదా మరి? చాలామంది ఊహించటంలో తృప్తిపడి వూరుకుంటారు. నువ్వు వూహించింది ప్రతీదీ స్వానుభవంలో కావాలంటావు" శేఖరంతో పాటు తనుగూడా నవ్వేసింది మంజు ఆ క్షణం ఎంతబావుంది!

చాలా సేపట్నుంచి శూన్యంలోకి చూస్తున్న మంజు కనులు క్రిందికి వాలి చేతికున్న గడియారం చూశాయి. ముల్లు బద్ధకంగా బరువుగా, నిర్ల

క్ష్యంగా తిరుగుతోంది. 7 కావటానికి మరో పదినిమిషాలుంది. ఎందుకో చెప్పినట్టుగా సరిగ్గా 7గంటలకి శేఖరం వస్తాడంటే మనసు నమ్మలేకుండా ఉంది. తన చేత వెళ్ళు అన్పించునేందుకే అతనంత నమ్రతగా నమ్మకంగా పల్కింది. మంజు మనసులో కలిగిన అనుమానం నిజమేనని గడియారం రుజువుచేసింది. 7 గం॥ దాటింది. చకచకా పదిహేను నిమిషాలు గడిచాయి. కాని శేఖరం రాలేదు. రాలేదని అతన్ని అని లాభంలేదు. అసలు తప్పు తనది. వెళ్ళండి-వెళ్ళండి అంది. ఇంకొంచెంసేపు అలాగే మూతిముడుచుకుని, కళ్ళు క్రిందకి వాల్చుకొని కూర్చుంటే అతనసలు వెళ్ళేవాడుకాదు. వెళ్ళింతర్వాత రాలేకపోవటం అతని తప్పుకాదు. కాని యెలా? ఎన్నాళ్ళిలా గుప్పెట్లో పట్టుకుంటుంది. అతని ఆదరణ కోసం తను బాధపడుతున్నట్లు యెన్నాళ్ళు నటించగలుగుతుంది? ఒకళ్ళు కావాలని గుప్పెట్లో పట్టుకోవాలని ప్రయత్నించి వుంచుకునేదా ఆ బంధం? ఎంత సున్నితమైంది! కాని తనేం చేస్తుంది? తనేం చేయగలదు! అసలు కాలుకి దెబ్బ తగలకుండా వుంటే బాగుండేదేమో! తన కప్పుడు ఈ లోతులు తెలిసేవికావు. నిట్టూర్పుతో మంజు వెనక్కు వాలింది. మందు వేసుకోలేదు. ఈ వారం రోజుల్లో ఒక్కరోజు తన చేత్తో తను మందు వేసుకోలేదు. టేబుల్ మీద తొంగి చూస్తున్న మందుగ్లాసువైపు దృష్టిని గిచ్చి అలాగే ఉండిపోయింది. మంజు.

ముందర హాల్లోవున్న గడియారం 8-9 గం. గూడా కొట్టింది. శేఖరం వస్తాలేదు. యెంతవద్దనుకున్నా మనసు బాధపడకుండా వుండలేకపోయింది. ఇప్పుడు వున్న పళంగా జ్వరం వస్తే-శేఖరం రాగానే మసలిపోతున్న తన ఒళ్ళు పట్టి చూస్తూ 'అరె-యిదేమిటి యింతకు ముందు బాగానే వున్నావుగా?' అని ఖంగారుపడితే చాలా బాగుంటుంది. కాని అలా జరగలేదు. ఆలోచించి ఆలోచించి నీరసం, తలనొప్పి మట్టుకు వచ్చాయి. కాని అవి పైకి కన్పించవు.

గడియారం 9 గంటలు కొట్టిన పదినిమిషాలకి బయట కారు హారన్ విన్పించింది. అంతవరకూ ఆలోచిస్తూ గోడకి చేరగిలబడి కూర్చున్న మంజు చేతినున్న గడియారం తీసేసి దూరంగాపెట్టి పడుకొని కనులు మూసుకుంది.

"మంజూ!" అనే పిలుపు కోసం చెవులు శ్రద్ధగా వింటున్నాయి. కాని శేఖరం పిలవలేదు. "మంజూ నిద్రపోయిందా! మందు వేసుకుందా" అని మటుకు హాల్లో శంభుని అడగటం విన్పించింది. "ఆ!" రెండింటికీ కలిపి ఒక్క అక్షరంలో సమాధానం ఇచ్చాడు శంభు. అమ్మగారు మందు వేసుకోవటంలో అశ్రద్ధ చెయ్యరు. అది ప్రత్యేకం అడగక్కరలేదు. ఇహపోతే గదిలో లైటు తీసేసి చాలా సేపయింది. శబ్దంకూడా లేదు. ఆలా నిశ్శబ్దంగా కూర్చోవటం మంజు స్వభావానికి విరుద్ధం. అందుకే నిద్రపోయిందని చెప్పాడు.

నిద్రపోయిన మంజుని లేపి—తను ఆలస్యంగా వచ్చానని గుర్తు చెయ్యటం యిష్టంలేని శేఖరం వెంటతెచ్చిన నాటకాల్లో క్లబ్ వార్షికోత్సవానికి వేస్తున్న దాన్ని పరిశీలించటంలో నిమగ్నుడై పోయాడు.

మర్నాడు శేఖరం నిద్రలేచేసరికి మంజులేచి మామూలుగా తిరుగుతోంది. "మళ్ళా తిరుగుతున్నావు కాస్త నాలుగురోజులు విశ్రాంతి తీసుకోగూడదూ కాలుపచ్చి యింకా సాంతం పోలేదు" రాత్రి తను ఆలస్యంగా రావటంతో మంజుకి కోపం వచ్చిందని సులువుగానే గ్రహించిన శేఖరం తనే స్వయంగా కల్పించుకుని అన్నాడు.

"ఏం ఫర్వాలేదు. కాలుని గురించి దిగులు పడవలసింది నేను. బాగానే తగ్గిపోయింది. తగ్గకపోయినా ఫర్వాలేదు.మీరింక మీ మీటింగ్స్‌ని వాటికి మానుకోవాల్సిన అవసరంలేదు" మంజు ఎత్తి పొడుపుకి శేఖరానికి కోపం వచ్చింది. అంతేమరి. ఆడవాళ్ళ తత్వమే అంతేనేమో నిన్నటిదాకా తాను చేసిందంతా ఒక్కరాత్రిలో మర్చిపోయింది. శేఖరం గూడా ముభావంగానే వుండిపోయాడు. కనీసం ఆలస్యం అయింది అని గూడా చెప్పకూడదు. రాత్రి తను అంతసేపు ఎదురుచూసే-అసలు తనకు కాలు నయం కాకపోతే యింకా ఎంత సంతోషించేవాడో, శేఖరంమీద కోపంతో మంజు యింట్లో నౌకర్లందరికీ ఒక్కసారి శలవు యిచ్చింది. ఎన్నాళ్ళనుంచో అడుగుతోంది వంటమనిషి—ఒక్క నాలుగు రోజులు బెజవాడ వెళ్ళి మా చెల్లెల్ని చూసివస్తానని శెలవు యివ్వటమే కాదు- రైలు చార్జీలు కూడా యిచ్చి మరీ "నాలుగు రోజులున్నా ఫర్వాలేదు. నా కాలు నయం అయిందిగా" అని చెప్పి పంపింది.శంభు పెద్దవాడయిపోయాడు.

రాత్రి దగ్గు అదీ విపరీతంగా వస్తోందట-నాలుగు రోజులు కదలకుండా మందు తీసుకోమని ఆజ్ఞలు జారీ చేసింది

ఇహపోతే రాజు. రాజుకి శలవు తీసుకోమని యెవరూ చెప్పక్కర్లేదు. యెవరూ పిలవకపోతే అతనే తీసుకుంటాడు.

"అందరినీ ఒక్కసారి ఎందుకు పంపావు? యింట్లో పనులన్నీ యెవరు చేస్తారు. నీ కాలు ఇంకా వచ్చి మాననేలేదు అయినా నాతో మాట మాత్రం కూడా చెప్పక్కరలేదా? యింట్లో నేనింత అనామకుడిగా ఉన్నానా?" ప్రతి చిన్నపనికీ కుంటుకుంటూ తిరుగుతున్న భార్యని చూసి బాధపడ్తూ కోపంతోఅన్నాడు శేఖరం. మంజు యెప్పుడూ అంతే! శేఖరం మీద కోపంవస్తే తనమీద సాధించుకుంటుంది. "నేను కాపరానికి వచ్చిన తర్వాత మీతో చెప్పకుండా స్వతంత్రంగా చేసిన పని యిదొక్కటేగా. ఎన్నిసార్లు "నీయిష్టం- నీయిష్టం వచ్చినట్లు చేసుకో మంజూ" అని మీరు అనలేదు? కానీ నే నెప్పుడూ నా యిష్టానుసారంగా వెళ్ళలేదు. ప్రతిదానికి మిమ్మల్ని అడుగుతూనే వచ్చాను. ఈ ఒక్క చిన్న విషయం అడగక పోయినా పర్వాలేదు అనుకున్నాను. నాకేం తెలుసు "నీ యిష్టం" అనే మీ మాటలకి విలువలేదనీ, అవి తాత్కాలికంగా నాలిక చివరినుంచి వచ్చాయని? పెళ్ళయిం తర్వాత నేను చేసిన మొదటి తప్పు యిది. పర్వాలేదు మీరు క్షమించవచ్చు."

బాగా దగ్గరగా వచ్చి, తగు స్థాయిలో ఖచ్చితంగా కోపంగా అంటున్న మంజువంక రెప్పవాల్చకుండా చూడసాగాడు.

నిన్న మొన్నటి వరకు పసిపాపలా, దేవకన్యలా వున్న మంజుకి ఈరోజు ఏమైంది? తనెందుకు అంటున్నాడు మంజు మంచికోరి కాదూ? కాస్తకూడా అర్థం చేసుకోదే? ఈ సారి శేఖరానికి నిజంగానే కోపం వచ్చింది. అక్కడినుంచి కదిలి వెళ్ళిపోతూ "సరే నీ యిష్టం. నీ యిష్టం వచ్చినట్లు తిరుగు, కాని యీసారి కాలునొప్పి అంటే మటుకు...." శేఖరం ఏదో చెప్పబోయాడు,

"అనను, అనను అంటే ఒట్టే-సరేనా? కాలు నొప్పే కాదు. నా నా రెండుకాళ్ళు తీసేసినా, రెండు చేతులు నరికేసినా, కళ్ళు రెండూ గుంటలుపడి కన్పించకపోయినా బాధ అనిగాని, అబ్బా అనిగానీ అనను

సరేనా?" శేఖరం వంక చూస్తూండగానే మంజు కళ్ళల్లో నీళ్ళు నిండిపోయినాయి.

"మంజూ!" శేఖరం చప్పున దగ్గరకు రాబోయాడు. కానీ అతను వచ్చే లోపలే అక్కడ్నుంచి పారిపోయింది మంజు మొహం రెండు చేతుల్లో కప్పుకుని.

ఆరోజు భోజనం చెయ్యకుండానే వెళ్ళిపోయాడు శేఖరం మంజు యేదన్నా భరిస్తుంది కాని శేఖరం వేళకు భోజనం చెయ్యకపోతే ఊరుకో లేదు. అతను బయట ఏదీ తినడు. అందరిలా అతను హోటల్ తిళ్ళకి అల వాటు పడ్డవాడు కాదు. ఉదయం యిచ్చిన కాఫీ కూడా తాగలేదు. 12 గంట లకు క్యారియర్‌లో భోజనం సర్ది రాజుతో ఆఫీసుకి పంపింది. క్యారి యర్‌తో పాటు "నామీద కోపం యీ భోజనం మీద చూపించకండి. మీరు పూర్తిగా భోంచేసింది లేందీ రాజు పరీక్షగా చూస్తూనే వుంటాడు. త్వరగా వచ్చేయండి" అని రాసి పంపింది.

క్యారియర్ తీసుకుని రాజు వెళ్ళిపోయాడు. "అవును, నేనే సర్దు కోవాలి. శేఖరం మగవాడు. అతనికి బోలెడన్ని పనులుంటాయి. ఎప్పుడూ నా కొంగుపట్టుకుని కూర్చోమంటే ఎలా సాగుతుంది? అతను నిర్వర్తించ వలసిన కర్తవ్యాలలో నాపట్లచూపే ఆదరాభిమానాలు ఒక భాగం మాత్రమే. నాకు అతను ఒక్కడే లోకం కావచ్చు. కానీ అత నికి నేనొక్కదాన్నే లోకం ఎలా అవుతాను? అది నేనే అర్థం చేసు కోవాలి" అనుకుంది.

భోజనం అదీ పూర్తిచేసుకుని మంజు వచ్చి హాల్లో కూర్చుంది. కళ్ళు గడియారాన్ని గమనిస్తున్నాయి. చెవులు చప్పుడు కాబోయే పాదాల శబ్దానికి ఎదురు చూస్తున్నాయి. చేతులు మటుకు పరధ్యానంగా దిండుకవరు మీద రంగుదారాలతో పూలు కుడుతున్నాయి. మనసు మరోచోట ఆలో చిస్తోంది. ఈ సరికి రాజు వెళ్తాడు. క్యారియర్ టేబుల్ మీద పెట్టి తనిచ్చిన ఉత్తరం యిస్తాడు, అది చదువుకున్న శేఖరంవచ్చి కోపంగానే భోజనం ముందు కూర్చుంటాడు. కూర్చోబోతుండగా తనమాటలు జ్ఞాపకం వస్తాయి శేఖరం తలతిప్పి చూస్తాడు. ప్రక్కన ఏదో సర్దుతున్న నెపంతో రాజు నిలబడి వుంటాడు. రాజుని గమనించిన అతను నవ్వుకుంటూ భోంచెయ్యవచ్చు, లేకపోతే లెక్కేమిటని నిర్లక్ష్యంగానూ భోంచెయ్యవచ్చు.

బైట సైకిల్‌బెల్ వినబడ్డంతో మంజు ఉలిక్కిపడి తలెత్తింది. రాజు క్యారియర్ తీసుకుని తిరిగివచ్చాడు.

"ఏమన్నారు అయ్యగారు?" గబుక్కున అడిగేసింది.

సమాధానంగా రాజు నవ్వుతూ యేం చెప్పలేదు, పోనీ జేబులోంచి యేకాగితమూ తీసియివ్వనూలేదు. నిదానంగా దగ్గరకువచ్చి "ఆఫీసులో లేరమ్మా! వచ్చి ఒక పదినిమిషాలుండి వెళ్ళిపోయారని చెప్పారు. క్యారియర్ తెచ్చేశాను" అన్నాడు.

మంజు చేతులు అంతవరకుకుడుతూన్న దిండుగలీబుని నిర్లక్ష్యంగా పక్కకు విసిరేశాయి. అంతవరకు ఆసక్తితో గడియారంవంక చూస్తున్న కళ్ళు కోపంతో యెరుపెక్కాయి. పెదవులు మట్టుకు లోపల కలిగిన కోపాన్ని దాచుకుని, "సరే! నువ్వెళ్ళి లోపల పని చూసుకో" అన్నాయి.

రాజు లోపలికి వెళ్ళిపోయాడు. మంజు లేచి వచ్చి గదిలో మంచం మీద పడుకుంది. యెక్కడకు వెళ్ళినట్లు? యింకెక్కడికి? క్లబ్ వార్షికోత్సవం దగ్గరకు వస్తోంది-ఆ రాజా దగ్గరకు వెళ్ళివుంటారు. వెళ్ళేవారు ఫోంచేసి వెళ్ళగూడదూ? తనిక్కడ అనవసరంగా ఖంగారుపడ్తూంటే. యింకేం- ఆ రాజా దగ్గర ఫోంచేసి హాయిగా నవ్వుతూ సిగరెట్ కాల్చుకుంటూ కబుర్లు చెపుతుండవచ్చు. మంజు ఒకసారి తన పాదంవైపు చూచుకుంది. దెబ్బ తగలటం వో విధంగా మంచిగానే అయింది. తనకి కొన్ని చేతలతోపాటు మరికొన్ని అర్థాలుకూడా తెలిశాయి. పోనీ, చెప్పగూడదూ అలా వెడుతున్నానని తను కాదంటుందా? పోయిన కోపం రెట్టింపుబలంతో వచ్చి మళ్ళీ తిష్ఠవేసింది. ఆరోజుకాదు- ఆరు రోజులు, ఆరునెలలవరకూ శేఖర్‌తో ఆప్యాయంగా మాట్లాడకూడదు. అతను కేవలం భార్యగా చూస్తుంటే తనేనా చూపలేంది. తనూ చూడగలదు. ఈ క్షణంలో అతనుభర్తే! భర్తగా యివ్వవలసిన గౌరవం మాత్రమే ఇస్తుంది. అపైన పిసరంత ఆప్యాయతగూడ చూపించగూడదు. అంతే. మంజు మనసులో గట్టిగా ఒట్టు వేసుకుంది.

హాల్లో గడియారం మూడు కొడుతూండగా వాకిట్లో కారు హారన్ వినిపించింది. ఆ కారు హారన్ శేఖర్‌దని తెలిసిన మంజు మంచంమీద నుంచి లేవలేదు. హాల్లో ఏదో పనిచేస్తున్న రాజు గేటు తీయటం కోసం

పరుగెత్తిన శబ్దం విన్పిస్తోంది. లోపలికి కారు వచ్చిన శబ్దంకూడా విన్పిస్తోంది. వింటూ పడుకుంది మంజు ఏ మాత్రం చలనం లేకుండా.

రాజు పరుగెత్తుకుంటూ లోపలికి వచ్చాడు. "అమ్మగారూ! శేఖరం బాబు కళ్ళకేమిటో కట్టు కట్టారు. వెంటడాక్టర్‌యోగానందంగారున్నారు" అన్నాడు ఆ మాటలు పూర్తిగా వినకుండానే మంజులేచి హాల్లోకి పరిగెత్తుకొచ్చింది. అప్పటికే శేఖరం లోపలికి వచ్చాడు. అతని కళ్ళు రెండూ తెల్లటి దాండేజితో వున్నాయి. చెయి పట్టుకుని నడిపిస్తున్న డాక్టర్‌యోగానంద్ గోడవారగా వున్న కుర్చీ చూపిస్తున్నాడు. ప్రక్కన రాజాకూడా వున్నాడు.

"ఏమిటిది! ఏమైంది?" హాల్లో గుమ్మందాటి రాబోయి. ఆగిపోతూ అంది మంజు. ఆరోజుతనపాదంతెగినప్పుడు సరీగ్గా ఏకుర్చీలోకూర్చుందో అదే కుర్చీలో కూర్చున్నాడు శేఖరం.

మంజు పిలుపుకి రాజా తలతిప్పి చూశాడు. డాక్టర్ యోగానంద్ మంజు వైపుగా చూస్తూ "ఈరోజు లేచినవేళ చాలా మంచిదమ్మా! చాలా పెద్ద అపాయం. వెంట్రుక వాసిలో తప్పిపోయింది. ఈ రోజు శేఖరం కన్ను పూర్తిగా పోవల్సింది, కేవలం నీ అదృష్టమే" అన్నాడు.

"క్లబ్ వార్షికోత్సవం రేపని మీకు తెలుసుగదా! స్టేజీ ఏర్పాట్లు చూస్తున్నాం. రేపు మేం వెయ్యబోయే నాటకానికి ప్రత్యేకంగా తెరలూ అవీ ఏర్పాట్లు చేస్తున్నాం. ఆ తెరల ఏర్పాటుకి ఇనుపతీగె ప్రక్కన అమర్చి క్రింద గుంజుతున్నాం. అది సరిగ్గా ఉందో లేదో చూడబోతే శేఖరానికి పొరబాటుగా వచ్చి కంటికి తగిలింది. పైన వైర్‌ని ఫిట్ చేస్తున్న అతను శేఖరాన్ని చూడకుండా గుంజాడు. అది మొహంమీద నుంచి రాచుకు వెళ్ళటంతో చీరుకుపోయింది." రాజా ముందుకువచ్చి చెప్పాడు.

"భయంలేదమ్మా అంత పెద్ద ప్రమాదంలేదు. కానీ కళ్ళకిమాత్రం అలసట కలగగూడదు. అందుకే యివతలి కన్నుకిగూడ కట్టు కట్టింది. ఈ రోజు, రేపు ఇంట్లోంచి కదలకుండా చూసేభారం నీది. రేపు క్లబ్

వార్షికోత్సం గూడాను. ఏదయినా ఇంట్లోంచి కదలగూడదు శేఖరం! నీకే చెప్తోంది." హెచ్చరిస్తున్నట్లు రెండు విధాలుగా అన్నాడు.

రేపు క్లబ్ వార్షికోత్సవం. ఆ రోజుకోసం ఎన్ని ఏర్పాట్లు చేస్తున్నాడో మంజుకి తెలుసు కానీ రేపటిరోజు కళ్ళు తెరవటానికి వీలులేదు. వస్తుంది-వస్తుంది-అనుకుని యెదురుజూచిన క్షణం వచ్చినప్పుడు ఎందుకూ కొరగాకుండా పోతే! శేఖరం మొహంలో ఎలాటి మార్పులేదు. చాలా రోజుల్నుంచి అలా కూర్చోవటానికి అలవాటుపడినవాడిలా కూర్చున్నాడు.

"ఫర్వాలేదులే. నేను అన్నీ చూసుకుంటాను. నువ్వూరికే బాధ పడకు" అన్నాడు రాజా వెళ్ళబోయే ముందు.

"నువ్వు చూసుకోగలవనే ధైర్యం నాకుంది. నేను ఆటైమ్‌కి మటుకి వస్తాను, నాకు దిగులేం లేదు."

దెబ్బ తగిలిందని అతను కంగారు పడటంలేదు. మంజుని పిల్చి దగ్గరగా తీసుకోలేదు. నిశ్చలంగా కూర్చుని రేపు జరుపబోయే వాటిని యేవేవి తను చేశాడో-ఇంకా మిగిలినవి రాజా ఏవేవి చెయ్యాలో నిదానంగా తాపీగా చెప్తున్నాడు. అన్నీ వింటూ బొమ్మలా అక్కడే నిలబడి పోయింది మంజు. క్షణంసేపు శేఖరానికి ఏ దెబ్బా తగలలేదు, అంతా నటనేమో అన్పించింది. మరుక్షణంలో అతని ఆత్మ విశ్వాసానికి అన్నీ పట్టించు కున్నట్లుండి మళ్ళీ అవసరం అయితే దేనికీ లొంగకుండా అతీతంగా ఉండే స్థిరమైన అతని వ్యక్తిత్వానికిముగ్ధురాలయిఅలాగేనిల్చుండి పోయింది.

కొద్దిసేపయింతర్వాత యోగానంద్, రాజా వెళ్ళిపోయారు వెళ్ళిపోబోయే ముందు, రేపు సాయంత్రం ఒక్కపావుగంటపాటు శేఖరం స్పీచ్ ఇవ్వవలసిన టైమ్‌కి కట్టు విప్పి మళ్ళీ వెంటనే కట్టేటట్టు ఒప్పుకున్నాడు యోగానంద్. ఒప్పుకున్నాకగాని వెళ్ళనివ్వలేదు శేఖరం.

వాళ్ళిద్దర్నీ గుమ్మందాకా సాగనంపి వెనక్కి తిరిగి వచ్చింది మంజు.

"మంజూ! ఇలారా" వెనక్కి తిరిగి వస్తున్న పాదాల చప్పుడు గమనిస్తూ అన్నాడు శేఖరం.

"గుర్తొచ్చానా ఇప్పటికయినా!" అతనికి కొద్ది దూరంలోకి వచ్చి ఆగిపోతూ అంది మంజు.

"ముందిలా రా! రాజా వాళ్ళెవ్వరూ ఇక్కడలేరుగదూ?" శూన్యం లోకి చెయ్యిజాస్తూ మంజు మాట వినవచ్చిన వైపుగా అన్నాడు శేఖరం. మంజు చప్పున వచ్చి శేఖరం చేయి అందుకుని అందులో మొహందాచు కుంది!

"ఏమిటది! ఛ. ఛ ఏడుస్తున్నావా? ఈ మాత్రానికే? ప్రమాదం లేదుగా. . .డా॥ యోగానంద్ అన్నమాటలు విన్నావా? కేవలం నీ అదృష్టం అన్నాడు. ఏదీ నీ కాలు ఎలా వుంది? ఈరోజు నేనసలు చూడనే లేదు" శేఖరం వంగి తడుముతూ మంజు పాదం కోసం వెదకసాగాడు.

"నా పాదానికేం.ముందు మీరిది చెప్పండి. ఒకవేళ నిజంగానే కన్నుకి దెబ్బతగిలినా, దురదృష్టవశాతు ఏ ప్రమాదం జరిగినా మీరింత నిశ్చలంగా వుండగలరా" శేఖరం చేతిని తన రెండుచేతుల్లోకి తీసు కుంటూ అంది మంజు.

"ఎందుకుండను? తప్పకుండా, ఇప్పుడు నాకు చాలా హాయిగా ఉంది. నిశ్చింతగా కళ్ళు మూసుకుని నీ యెదుట కూర్చోవచ్చు. నువ్వనేది ఎప్పుడూ కోరుకునేది అదేగా! నువ్వు కోరుకున్నట్లుగా యిహ నీ ముందే కూర్చుంటా. ఒక్కసారైనా వినుకోక మరి, చెప్తాను నీవని" మంజు చేతితో ఆడుకుంటూ అన్నాడతను.

"మీరెప్పుడూ నాముందుండాలని కోరుకోవటం- మిమల్ని ఏ కుంటివారో, గుడ్డివారో కమ్మనా? నా కోసమేనా? ఈ దెబ్బతగిలింది." శేఖరం చేతుల్లోంచి తనచేయి గుంజుకుంటూ అంది మంజు.

"అదిగో మళ్ళీ కోపం వస్తుంది నీకు. నానుంచి నువ్వు దూరంగా పారిపోతే నేను నీ వెంట రాలేనుగా. కోపం పోయింతర్వాత మళ్ళీనువ్వే రావాలి" మంజు మళ్ళీ దగ్గరగా వచ్చి చేయి యిచ్చింది. ఆ చేతిని తీసు కుని మంజుని దగ్గరకు లాక్కుంటూ అన్నాడు శేఖరం:

"చూడు మంజూ! ప్రతిదాన్నీ నిమిత్తమాత్రంగా తీసుకోవాలి. నిజంగా బాధపడవలసిన పరిస్థితిల్లో అది మనం అనుకున్నా ఆగదు. కాని ఏదో జరగబోతోంది, జరుగుతుంది అని బాధపడటం దుర్బలత్వం. జరిగిందానికి సమాధానపడటం యోగ్యుల లక్షణం. ఎప్పుడో ఏదో జరగబోతోంది అని ముందే బాధపడటం. అది పిరికివాళ్ళ లక్షణం. తెలిసిందా! కంటికి దెబ్బ తగిలింది! కొంచెం బాధగానే ఉంది. కాని దాన్ని అలాగే గుర్తుంచుకుని మనశ్శాంతి పాడు చేసుకోవటంవల్ల కలిగే ప్రయోజనం ఏమిటో చెప్పు?"

"మరి నా కాలుకి తగిలిన దెబ్బకూడా చిన్నదే—నాకంత బాధ యెందుకన్పించాలి? దాదాపు లోకమే శూన్యమైనట్లు జీవితమే స్తంభించి పోయినట్లు అన్పించటం దుర్బలత్వమేనా? అయితే నేను పిరికిదాన్నన్న మాట మరి—"

"లేదు పిరికితనం కాదు. అది అందమయిన భావం. కాలు ఏమై పోయినా నీకు దిగులులేదు. కాని దానివల్ల నేను దూరమైపోతానేమోనని నీ భయం అవునా? ఆ భయం నాకు లేదు. నీలా నాకు నీ మీద అనుమానాలు లేవు. ఒకవేళ దెబ్బ కొంచెం పైగా తగిలి నిజంగా కన్నుపోయినా నేను విచారపడేవాన్ని కాదు. నాకు తెలుసు-నా కన్నుపోతే నువ్వు నా కన్నువవుతావని చెప్పు. కాదా! నేను ఉదయం నుంచి ఏం తినలేదన్న సంగతి నువ్వు మర్చిపోయావులా వుందే? ఆకలౌతోంది. నీ చేతుల్తో తినిపిస్తే తింటాను. ఏదీ-నన్ను మన గదిలోకి తీసుకెళ్ళు. రేపు క్లబ్‌కి కూడా నువ్వే తీసుకెళ్ళాలి. చూడు మరి, నువ్వు సరదాకి నేర్చుకున్న కారు డ్రైవింగ్ ఎలా వుపయోగపడ్తోందో! ఎక్కడ ఆలోచిస్తున్నావు? ఒక్కదానికీ సమాధానం చెప్పవేం?"

"అహ. లేదు లేదు. పదండి, గదిలోకి తీసుకెళ్తాను" అంది మంజు కుర్చీలోంచి లేచిన శేఖరానికి చేయి ఆసరాయిస్తూ.

"ఏమిటది?"

"మీరు చెప్పిందే! అన్నింట్లో తిరుగుతూ మళ్ళీ అన్నింటికీ అతీతంగా వుండటం."

"అంతేగాని-మీలో నాకే అనుమానంలేదు అనవన్నమాట! అదేమో నువ్వు తెలిసికున్న సత్యం అనుకున్నాను" అన్నాడు శేఖరం ముందుకు వెయ్యబోతున్న అడుగు ఆపివేస్తూ.

"లేదు లేదు. మీలో నాకెప్పుడు అనుమానం లేదు. ఎందుకో ఒక్కొక్కసారి అలా అంటానుగాని, అదికూడా మీకు తెలిసే వుంటుంది. పదండి" అంది మంజు కనులు తుడుచుకుని శేఖరం చేయిపట్టుకుని ముందడుగువేస్తూ. మంజు మనసులో మారుమూల యెవరో అంటున్నారు: 'ఇప్పుడు కాదు. కొన్నికోట్ల యుగాలు గడిచినా అంతేనేమో! స్త్రీపురుషుల్లో వుండే ఈ అతి నాజూకైన భావాలకి మార్పు లేదేమో!' అని.

—oo—